# ప్రేమ తెలివి మీరి పోయింది

—గోటేటి జగన్మోహనరావ్

**శీతాకాలం!**

అసలే చలి! చలికి తగ్గట్టు మంచు వర్షంలా కురుస్తోంది. నా తలమీద మంచు బిందువులు టప్, టప్ అంటూ పడుతుంటే, నా గుండెలో జివ్వు మంటూంది.

పొగమంచు వల్ల ఎదురుగా ఏ మొస్తున్నదీ. ఏమున్నదీ కనపడకపోయినా. స్పీడుగానే తొక్కేస్తున్నాను సెకిలు. ఇక మూడు కిలోమీటర్లు ఉంటుందేమో నే వెళ్ళవలసిన ఊరు!

ఊరు సమీపిస్తూన్న కొద్దీ మనసంతా ఒకటే ఆందోళన! బాధ! నే నొకటనుకుంటే, మరొకటి జరగబోతూంది. అదే నా బాధ! నా ఆందోళన!

సూర్యం అంత పని చేస్తాడా?

వాడి కెన్ని వేల గుండెలు ఇంత పని చేయడానికి?


వాడు నాకు తమ్ముడే అయినప్పటికీ, అమ్మా, నాన్న లేకపోవడం వల్ల వాణ్ణి చిన్నప్పటినుంచి నా కన్న కొడుకులా పెంచుకొచ్చాను. ఏ లోటూ రానీయకుండా. బి.ఎస్.సి. చెప్పించి, బి.ఇడి. చేయించి ఓ హైస్కూల్లో టీచర్ జాబ్‌లో పెట్టాను. ఎక్కువ కట్నంతో ఓ మంచి సంబంధంకూడా ఖాయ పరుస్తూన్న సమయంలో వీడు ఇలా చేస్తాడా?


వాడంటే నాలో కోపం పెరిగిపోతోంది!

వెళ్ళగానే, పట్టుకుని ఆ చెంప, ఈ చెంప వాయించేయాలి! చితకతన్నేయాలి పట్టుకుని! లేకపోతే ఇంత పని చేస్తాడా? నాకు తలవంపు తెచ్చే పని చేస్తాడా?

వెధవ! వెధవన్నర వెధవ!

ఇంత చలిలో... ఈ టైమ్‌లో... ఇలా సెకిలు మీద అమలాపురం నుంచి నన్ను రప్పించే ఈ పని చేస్తాడని నేను కలలో కూడా ఎప్పుడూ ఊహించలేదు.






రాత్రి సంఘటన జ్ఞప్తికి తెచ్చుకుంటుంటే మనస్సు తరుక్కుపోతోంది. నాలో ఆవేశం పొంగి పొర్లుతోంది!

ఇంతవరకు నా జీవితంలో ఎవరి నోటా తిట్టు తినలేదు! ఎవరి వల్లా అవమాను పడలేదు!

కాని...రాత్రి...!

నా మనసు బాధతో మూ లుగుతూంది!

అయినా. మళ్ళీ జ్ఞాపకం వచ్చేస్తోం దా సంఘటన...!

** ** **

టైమ్ ఎనిమిదవుతోంది!

ఆఫీసులోంచి బయటపడి చాలా సేపే అయినా. నా ఫ్రెండూ. కొలీగూ అయిన దుర్గారావుతో వాళ్ళింటి కెళ్ళి. ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చే °సి. ఇక ఇంటికి బయలుదేరాను. వాడి దగ్గర సెలవు తీసుకుని.

మా వీధికి మలుపు తిరుగుతుంటే. "ఓ సారి ఆగండి. మీతో పనుంది!" అంటూ నా సైకిలుకి అడ్డ మొచ్చాడు ఓ యువకుడు.

'ఎవరా?' అని ఆగి చూశాను.

అతను మా ఇంటి ఎదురుగా ఉన్న ఇంటి వారబ్బాయి. వాళ్ళకి. మాకు మంచి చనువే ఉంది. మా ఇంటికి వాళ్ళు రావడం. వాళ్ళింటికి మే మెళ్ళడం పరిపాటే!

"ఎందుకు? ఏమిటి పని?" అడిగాను.

"మా నాన్నగారు మిమ్మ ల్నోసారి తీసుకుని రమ్మన్నారు—మీతో ఏదో మాట్లాడాలట!"

"ఇంటి దగ్గరే ఉన్నారా?"

"ఇంటి దగ్గరుంటే ఇక్క డెందుకు ఆవుతాను? ఇక్కడే... మాచుట్టాలింటి దగ్గర ఉన్నారు. రండి వెళదాం." నా చేతిలోంచి నా సైకిల్ని తీసుకున్నాడు.

తను తొక్కుతూ. "ఎక్కండి" అన్నాడు. నే నేం మాట్లాడకుండా వెనకాల ఎక్కి కూర్చున్నాను. స్పీడుగా తొక్కి తీసుకెళ్ళి ఓ ఇంటి దగ్గర ఆపాడు. తనే నా సైకిలు స్టాండే °సి. లాక్ చే °సి. "రండి" అంటూ ఎదురుగా ఉన్న రూమ్‌లోకి దారి చూపించాడు.

లోపలి కెళ్ళాను. అక్కడ వీళ్ళ నాన్నగారు లేరు కాని. వాళ్ళ అన్నగార్లు ముగ్గురూ మాత్రం ఉన్నారు.

"అలా కూర్చోండి." ఓ కుర్చీ చూపించాడు వాళ్ళలో పెద్దతను.

"మీ నాన్నగారు ఎక్కడ?" కూర్చుంటూ రూమ్ అంతా మళ్ళీ ఓ సారి చూస్తూ అన్నాను.

"ఇక్కడ లేరు." రెండో అతని జవాబు అది. కొంచెం కరుకుగా ఉంది అతని కంఠం.

"మరి... పిలుస్తున్నారని చెప్పాడు మీ తమ్ముడు?" నా కర్థం గాక అడిగాను. వాళ్ళ కే °సి చూస్తూ.

"అలా అని చెప్పమన్నాం. మిమ్మల్ని మేమే పిలిచాం" అన్నాడు. మూ డో అతను కోపంగా.

ఏం జరగబోతోందో నా కర్థం కావటం లేదు!

ఇంతలో ఆఖరివాడు (అంటే...నన్ను ఇక్కడికి తీసుకు వచ్చినవాడు)వీధి తలుపు గడియ పెట్టేశాడు.

ఈ తతంగమంతా చూస్తుంటే. ఏదో జరగబోతూందని మాత్రం ఊహించ గలిగాను.

"మరైతే నన్నెందుకు పిలిచినట్టు?" చిరాగ్గా అడిగాను.

"చెపుతాం... మీ కీ విషయం తెలుసా?" పెద్దతను అడుగుతున్నాడు.

"ఏ విషయం?"

"అదే... మీ తమ్ముడు... సూర్యం... మా రెండో చెల్లిని పెళ్ళి చేసుకుంటానని చెప్పి మోసం చే °సిన విషయం?"

షాక్ తగిలినట్టయింది!

"ఏమిటీ? సూర్యం... అలా చేశాడా?

నే వింటున్నది నిజమేనా? కల కాదు కదా?"

"మాట్లాడరేం?" ఇంటరాగేషన్ పేరుతో నేరస్థుల్ని చితగ్గొట్టి. చిత్రహింసల పాలు చే సే పోలీ °సు ఆఫీసర్‌లా గద్దించాడు రెండో అతను.

అతని గదమాయింపుకి ఉలిక్కిపడి. "నా కీ విషయం తెలియదు. ఇప్పుడే వింటున్నాను. అయినా. నా తమ్ముడు అటువంటి వాడు కాదు" అంటూ ఏదో సర్ది చెప్పటానికి ప్రయత్నించాను.

నా మాటలకి వాళ్ళు నలుగురూ విరగబడి నవ్వారు!

ఆ అవమానాన్ని భరించక తప్పలేదు నాకు.

"పాపం! మీ తమ్ముడు ప °సిగుడ్డనుకుంటున్నారా. అటువంటివాడు కాకపోవటానికి? ఇవి చూడండి—మీకే తెలుస్తుంది. ఇవి మీ తమ్ముడు మా చెల్లికి రా °సిన లవ్ లెటర్స్." మూ డోవా డను కుంటాను అందించాడు ఓ ఫైల్.

తీసుకుని చూశాను.మొదట నమ్మలేకపోయినా. అవి చూస్తుంటే నమ్మవల °సి వస్తోంది! అవి సూర్యం రా °సినవే! ఆ రైటింగ్ వాడిదే!

"ఇప్పు డేమంటారు. ఆనందరావుగారూ?" అని ఫైల్ లాక్కున్నా డొకతను.

తప్పు ఒప్పుకోక తప్పదు. వాళ్ళ దగ్గర ప్రూఫ్ ఉంది!

"క్షమించండి! మీరు చిన్నవాళ్ళయినా మిమ్మల్ని ప్రాధేయపడుతూ అడుగుతున్నాను. ఇంకెప్పుడూ వాడు మీ చెల్లి జోలికి రాకుండా బుద్ధి చెప్తాను." వాళ్ళలో పెద్దతని చేతుల్ని పట్టుకుని అన్నాను బతిమాలుతూ.

"మీ తమ్ముడికి బుద్ధి చెప్తే. గొడవంతా సమ °సిపోతుం దనుకుంటున్నారా?" అన్నా డొకతను.

విరగబడి నవ్వా రంతా!

ఆ నవ్వుతున్న ముఖాల్ని చూడలేకపోయాయి నా కళ్ళు. తల దించేసుకున్నాను. ఏం మాట్లాడకుండా.

"చూడండి. ఆనందరావుగారూ! మొదటినుంచి మీ తమ్ముడు మా ఇంట్లో ఎంత స్వతంత్రంగా తిరిగినా. మాచెల్లెళ్ళతో ఏం మాట్లాడినా మేం ఏం అనలేదు. అనుమానించలేదు. కాని. మా చెల్లికి ప్రేమ గీమ నూరిపో °సి... పెళ్ళి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి...దానిలో ఆశలు రేపి... తన కోరిక తీర్చుకుని... మాచెల్లిని గర్భవతిని చే °సి... మోసం చే °సిపోయాడు." బాధగా చెప్పినా పెద్దతని మాటల్లో పగ బుసలు కొడుతూంది.

వాళ్ళ కేం సమాధానం చెప్పాలో తోచటం లేదు నాకు!

'ఇంతటి వాడయ్యాడా సూర్యం? ఇంత స్థాయికి ఎదిగిపోయాడా?'

"మీ రంటున్నది నిజమా?" నమ్మలేక అడిగాను.

"అబద్ధాలు చెప్పి. మాచెల్లిమీద అభాండాలు వేసుకుంటామా? రెండు నెల్ల క్రితం అయిదు రోజులు సెలవు లో స్తే వచ్చాడు చూశారా? అప్పుడు °సినిమాలకి. లాడ్జింగ్‌లకి తీసుకెళ్ళి—ఇంత పని చేశాడు మీ తమ్ముడు."

"అయితే. నన్నిప్పు డేం చేయమంటారు?"

"మా చెల్లికి. మీ తమ్ముడికి వెంటనే పెళ్ళి చేయాలి."

"పెళ్ళా!" అదిరి పడి అన్నాను.

"అవును. పెళ్ళే! మా పేరెంట్స్ °ని మేం ఒప్పిస్తాం—మీ తమ్ముణ్ణి మీరు ఒప్పించి..."

"ఇదెలా సాధ్యం? ఓ పక్క మా వాడికి ఓ సంబంధం కుదురుతోందికూడాను."

"కుదరబోయే దాని కోసం. కుదిరి తల్లితండ్రులు కాపడానికి రెడీగా ఉన్న బంధాన్ని విడదీస్తారా? అలా జరిగిన నాడు మా చెల్లి ఆత్మహత్య చేసుకుంటా నంటూంది... అలా జరిగిన నాడు ఈ సాక్ష్యాధారాలన్నీ చట్టం ముందుంచి... మీ తమ్ముణ్ణి జైలుకి పంపిస్తాను." తన ప్లాను వివరించాడు పెద్దతను.

30-1-85

"అలా జరిగిన నాడు... మీ తమ్ముణ్ణి చెట్టుకి కట్టి, కళ్ళల్లో సూదులుచ్చుకొని పొడుస్తాను." భాగల్పూర్ జైల్లోని ఖైదీల కళ్ళల్లో సూదులు పెట్టి పొడిచి, వాళ్ళని అంధుల్ని చేసిన పోలీసుల్లోని ఓ పోలీసులా కనిపించాడు రెండో అతను.

"ముక్కముక్కలుగా నరుకుతాను మీ తమ్ముణ్ణి జీవితంలో దెబ్బతిని బందిపోటుగా మారిపోయి. పగ తీర్చుకోడానికి రెడీగా ఉన్న బందిపోటులా కనిపించాడు మూడో అతను.

"మిమ్మల్నికూడా నరికి పగ తీర్చుకుంటాం." నరకడమే ధ్యేయంగాగల కుటుంబంలోంచి వచ్చిన వ్యక్తిలా ఉన్నాడు నాలుగో అతను.

'ఎంతో సౌమ్యంగా, మంచిగా ఉండే ఎదురింటి ప్రకాశరావుగారి పిల్లలు ఇలా మారిపోయారేమిటి? ఇలా ఉగ్రరూపం దాల్చారేమిటి?'

నాలో రకరకాల ఆలోచనలు! వాళ్ళు చెప్పినట్టు చేయకపోతే, అన్నంత పనీ చేసేలా ఉన్నారు మనుషులు!

'ఊ!' అనకపోతే అసలు నన్నిక్కడే సఫా చేసేలా ఉన్నారు!

అసలింతవరకు ఎప్పుడూ ఇటువంటి పరాభవాన్ని చవి చూడలేదు నేను. దీని కంతటికీ కారకుడు సూర్యం. అవును! వాడే! వాడు చేసిన తప్పుకి వాడే శిక్ష అనుభవించాలి. మెడ వంచి. ఆ అమ్మాయి మెడలో తాళి కట్టించడమే వాడికి తగ్గ శిక్ష! లేకపోతే, రేపు నలుగురిలోనూ ఈ అవమానాన్ని భరించగలమా?

"ఏమిటి మీ నిర్ణయం?" పెద్దతను అడిగాడు మెల్లిగా.

"అలాగే. నా కేం అభ్యంతరం లేదు! వాడు ఒప్పుకోకపోతే మాత్రం నే నేం చేయలేను!"

"మీరు చెబితే ఒప్పుకుంటాడు." మా గురించి బాగా తెలుసుకున్న వాడిలా అన్నాడు పెద్దతను.

తలుపు తీశారు. నన్నిక వెళ్ళమని. మళ్ళీ ఓసారి హెచ్చరిస్తూ. ఇంటికి ఎలా వెళ్ళానో నాకే తెలియదు. వెళ్ళగానే సెకిలు లోపల పడేసి. ఇంట్లో కెళ్ళి మంచం మీద వాలిపోయాను—కాళ్ళే నా కడుక్కోకుండా.

నా ప్రవర్తనకు ఆశ్చర్యపడి, కంగారుపడుతూ మా ఆవిడ వచ్చి పలకరిస్తే కస్సు బుస్సుమన్నాను. సూర్యం మీద ఉన్న కోపమంతా ఆవిడ మీద చూపిస్తూ.

కాస్సేపు అలాగే పడుకుని, లేచి కాచిన మంచినీళ్ళు తాగి స్తిమితపడి . మెల్లిగా విషయం చెప్పాను మా ఆవిడకు.

విషయం విన్న ఆవిడగారి నోట మాట రాలేదు.


"కుదుర్చుకుంటున్న సంబంధానికి చెల్లు కొట్టి. వెంటనే వీళ్ళ అమ్మాయితో చేసి పెళ్ళిచేయాలి." గట్టిగా నిశ్చయించుకున్న వాడిలా అన్నాను.

"ఇదెక్కడి ఖర్మండీ? మనకన్నా తక్కువ కులం కదా వాళ్ళది? రేపు మన పిల్లలకి ఏవైనా సంబంధాలు రావాలా, అక్కర్లేదా?" ఏడుస్తూ అంది మా ఆవిడ.

"వాడివన్నీ ఆలోచించాడా! అసలు మనం ఏమైపోతే వాడి కెందుకు?"

మా ఆవిడ ఓ క్షణం ఆలోచించి. "అసలిదంతా నిజమో, ఒట్టిదో? సూర్యం అటువంటి వాడు కాదండీ."

నేను నవ్వి, "నేనూ అలాగే అనుకున్నాను




మొదట. వాడు రాసిన లెటర్సు చూశాక తెలిసింది అసలు విషయం" అన్నాను.

"లెటర్సు కేముంది? వాడు రాసినట్టు వీళ్ళే రాసి, సృష్టించొచ్చుకదా? ఎందుకేనా మంచిది- తెల్లారకట్టే వెళ్ళి వాణ్ణే విషయం అడిగి తెలుసుకు రండి." సలహా ఇచ్చింది.

"నువ్వు పొరబడుతున్నావు, లక్ష్మీ! వాళ్ళ ముఖాలు చూస్తుంటే, వాళ్ళు చెబుతున్నది అబద్ధం అనిపించటం లేదు. ఏది ఏమైనా, పెళ్ళి చేసి తీరాలి! లేకపోతే రాబోయే పరిణామాలను ఎదుర్కోలేం. అయినా తెల్లారకట్టే వెళ్ళి తెలుసుకొస్తాను."

** ** **

ఎదురుగా వచ్చే ఓ లారీ దూసుకుంటూ పోవడంతో నా ఆలోచనలకి బ్రేక్స్ పడ్డాయి.

తడిసి ముద్దయిపోవడం వల్ల విపరీతమైన చలి పెడుతోంది. అంత చలిని, చల్లదనాన్ని అలాగే భరించుకున్నాను.

ఊరు సమీపించింది. వాడి రూమ్ నాకు తెలును. తిన్నగా వెళ్ళాను.

"ఇక్కడెన్ని వేషాలు వేస్తున్నాడో! ఎన్ని కొంపలకి నిప్పెడుతున్నాడో!" నా మనసు చిన్నగా మూలిగింది.

తలుపు కొట్టాను. దొరగారు గాఢ నిద్రలో ఉన్నట్టున్నారు! చాలా సేపటికి కాని తలుపు తీయలేదు.

కళ్ళు నలుపుకుంటూ. "ఇదేమిటన్నయ్యా...! ఇంత పొద్దున్నే...ఈ చలిలో, ఇలా తడిసిపోయి ఊడిపడ్డావ్?" కలా, నిజమా అన్న ధోరణిలో అడిగాడు.

చెంప చెళ్ళు మనిపిద్దామనుకున్నాను. కాని, చేతులు రాలేదు! అంతవరకు నాలో ఉన్న ఆవేశాన్ని నాలోనే అణుచుకుంటూ. "నువ్వు చేసిన నిర్వాకానికి ఇలా రావలసి వచ్చింది" అన్నాను.

వాడు వెంటనే ఏం మాట్లాడకుండా టవల్ తెచ్చి, నా తల తుడిచాడు. తన లుంగీ తెచ్చి ఇచ్చి "ముందు బట్టలు మార్చుకో- చల్లగా అయిపోయాయి" అన్నాడు. నా షర్ట్ బటన్స్ విప్పుతూ.

బట్టలు మార్చుకుని కూర్చుని. "నే నడిగిన దానికి నిజం చెబుతావా?" అని అడిగాను.

"అడుగు" అన్నాడు. తల 'చెబుతాను' అన్నట్టు ఊపుతూ.

అడిగాను విషయం- రాత్రి సంఘటనకూడా చెప్పి!

"ఆ అమ్మాయితో మాట్లాడ్డం తప్ప... తతిమా విషయమంతా ఒట్టిదన్నయ్యా! నేనెప్పుడూ లెటర్స్ రాయలేదా అమ్మాయికి." సిన్సియర్‌గా చెప్పాడు సూర్యం.

వాడు నిర్దోషి అంటే నేను నమ్మలేదు. వాడి వాలకం చూస్తుంటే నమ్మలేకపోతున్నాను.

"ఒరే! చూడు! ఇక గొడవ లనవసరం. నువ్వు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుని తీరాలి" అని వాడి ముఖం లోకి చూశాను.

దోషిలా తల వంచుకున్నాడు.

** ** **

ఎదురింటి ప్రకాశరావు గారితోను, వాళ్ళ అబ్బాయిలతోను మాట్లాడి దగ్గర్లో ఉన్న ముహూర్తానికి సింపుల్‌గా చేసేసి, నా బరువు వదిలించుకున్నాను. ఆడపిల్లకు పెళ్ళి చేసినట్టు ఫీలవుతూ.

సూర్యం వాళ్ళావిణ్ణి కాపరానికి తీసుకుపోయే రోజు నాతో చెప్పడానికి వచ్చాడు నా దగ్గరికి.

"అన్నయ్యా! నన్ను క్షమించాలి నువ్వు" అన్నాడు నా కాళ్ళు పట్టుకుని.

"ఎందుకు ?"

"నిన్ను మోసం చేసినందుకు! నేను, మా ఆవిడ ప్రేమించుకున్న మాట నిజమే...!"

"అది నేను నిన్నడగడానికి వచ్చిన నాడే గమనించాను."

"నువ్వు గమనించనిదికూడా ఒకటుంది...!"

'ఏమి' టన్నట్టు చూశాను.

"అదే... అన్నయ్యా! ఆ వేళ నిన్ను గదిలో బంధించి పరాభవం చేసింది... నేనే!"

ఆశ్చర్యపోయాను! వీడి బావమరుదులు చేస్తే నేనే' అంటాడేమిటి?

"మనది ఆర్థడాక్స్ ఫేమిలీ కదా! 'ఆ అమ్మాయిని చేసుకుంటాన'ని చెపితే... నువ్వు ... చేసేస్తారని. బలవంతంగా మరో సంబంధం ... ఆలోచించి మా బావమరుదులతో ఈ విషయం ... వారు ను. వాళ్ళూ చదువుకున్న వాళ్ళే కదా! ... మంచి కో-ఆపరేషన్ ఇచ్చి అలా డ్రామా ఆడారు. ఈ ప్లాన్ నాదే!

నిన్ను వాళ్ళు అలా నానా మాటలు అనటం ఇష్టం లేకపోయినా, ప్రేమించిన వ్యక్తిని సొంతం చేసుకోవటం కోసం అలా చేయవలసి వచ్చిందన్నయ్యా. నన్ను క్షమించానని చెప్పు!!!" అంటూ నా కాళ్ళు గట్టిగా పట్టుకుని వదలలేదు.

ఆశ్చర్యంతో నా నోట మాట రాలేదు.

'ప్రేమ ఎంత తెలివి మీరిపోయింది!' ★